శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

# రేగుపండు రుచి

ప్రొద్దున యిడ్లీ తింటూ కిటికీలోంచి కనిపించే ఆకాశంలో తెల్లని మబ్బుని చూస్తుంటే, తాను మబ్బునే తింటూన్నట్లుగా ఉంది. ఏదో మైమరపు. ఒళ్ళు తేలిపోయింది. అసలు ఉన్నట్లే లేదు.

కాఫీ త్రాగి, వెళ్ళి వరండాలో పడక కుర్చీలో నడుం వాల్చి ఎదురుగుండా ఉన్న వేప చెట్టుని చూస్తూంటే, దాని ఆకుల పచ్చదనం లేత ఎండలో మరీ పచ్చగా మెరుస్తూ నవ్వుతూ కనిపిస్తోంది. మధ్య మధ్య చిరుగాలి కితకితలకు చెట్టు ఊగుతోంది.

చిట్టి, నాలుగేళ్ళ మనుమరాలు, "తాతయ్యా" అంటూ ఒళ్ళో ఎక్కి కూర్చుంది, దాని బుల్లి కుడిచేతిలో పట్టీ పట్టకుండా నాలుగు రేగుపళ్ళు. ఎడంచేత్తో గౌను లాగి సరిచేసుకుని, ఆ పళ్ళని ఒళ్ళో పోసుకుని, ఒక దాన్ని తాతయ్యకిచ్చింది. "తిను తాతయ్యా!"

ఒకవైపు ఆకుపచ్చరంగు పసిమిగా మారుతూ, మరోవైపు దోర ఎరుపుగా మారిన పండీ పండని గుండ్రని ఆ పండు, చిన్న తొడిమతో ఎంతోఅందంగా ఉంది. పరిపూర్ణత అంటే యిదీ. పండిన వాటిల్లాగా మెత్తగా యిది వ్రేళ్ళతో చిదుమటానికి వీలుకాని పండు. ముందరి పళ్ళతో కొరికిచూచి తినవలసిన పండు. దీని రుచే వేరు....

తనకు ముందరి పన్ను ఒకటి ఊడిపోయింది. రెండోది ఊగులాడుతోంది. దాని కేదైనా తగిలితే జివ్వుమని సలుపుతుంది.

"అమ్మా, నువ్వే దీన్ని కొరికి పెట్టు, బావుందో లేదో చూడాలి!"

నిజానికి అలాంటి పచ్చి ఉన్న దోరరేగుపళ్ళు మోసం చెయ్యవు. ఎక్కడో ఒకటి తప్ప లోపల పుచ్చు ఉండదు. పండిన రేగుపళ్ళ పులుపుకంటే పండీ పండని వాటి తీపి-వగరు ఎంతో బావుంటుంది. అది ఈనాటి రుచి కాదు, అనుభవం కాదు, ఎన్నాళ్ళయిందో రేగుపండు రుచిచూచి! అసలు రేగుపండు తిందామనుకోవడానికి టైమ్ ఏదీ!

చిన్నతనంలో ఎదుటి వీధిలో తనతో ఆడుకునే స్నేహితురాలు లీల....వాళ్ళ యింట్లో పెరట్లో రేగుచెట్టు ఉండేది. అప్పటికింకా తాను బళ్ళో చేరలేదు. ప్రయివేటు మాష్టారు దగ్గర అక్షరాభ్యాసం అయింది. మధ్యాహ్నాలు స్వేచ్ఛ ఇంట్లో నిశ్శబ్దం. లీలతో వాళ్ళ పెరట్లో చేరి, రేగుపళ్ళు ఏరుకుని, ముని పళ్ళతో కొరికి చూచి తింటూ ఉంటే ఎంత బావుండేదో!

"తాతయ్యా, ఇదిగో" అంటోంది చిట్టి కొరికి చూచి బావుందని పండు అందిస్తోంది. పండు తీసి నోట్లో వేసుకున్నాడు. సాక్షాత్తూ లీల....వాళ్ళ పెరట్లో....యిలాగే, ఒకరు కొరికిన పండు మరొకరు తినడం....అది యిద్దరి మధ్యా ఏర్పాటు.

రేగుపండు రుచిలో ఉన్న అనుభూతిలో లీలముఖం' మధ్యాహ్నపు ఎండలో ఆమె నుదుటిమీద అదిరు చెమటలు, ఆ పలు వరుస, ఆ నవ్వూ ఆ కోపం, అన్నీ కళ్ళకు కట్టినట్లున్నాయి.

చిట్టి ముంగురుల్ని సరిచేసి, తల నిమురుతున్నాడు. చిట్టికి ఎవరైనా తన తల ముట్టుకుంటే యిష్టం ఉండదు. చిట్టి ఒళ్ళోనుంచి దిగి వెళ్ళిపోయింది. అప్పటికి తన పళ్ళు నేసి, విత్తనాలూ ఉమ్మేసింది.

కాని తాతయ్య నోట్లో విత్తనం, రాయిమల్లే, పక్క పళ్ళమధ్య తన గట్టితనాన్ని నిరూపించుకుంటూ, తన రుచిని పల్చన చేసుకుంటూ, నోరంతా విహరిస్తూ అలానే ఉంది.

రేగుపండు రుచిలో తన్మయతలో కన్నులు అరమూసిన తాతయ్యకు నిద్రరాలేదు. బాల్యం తిరిగివచ్చింది.

మధ్యాహ్నాలు ఆ ఎండలో స్వేచ్ఛ, ఆగాలిలో ఆప్యాయత, ఆ పచ్చదనంలో స్నేహం, పెచ్చులూడిన ఆ పెరటి గోడ పత్యేకత, ఆ రేగుచెట్టు అందం, లీల ఆగ్రహానుగ్రహాలూ-అబ్బ, జీవించడంలో ఎంత తియ్యదనం. ఎంత ఆనందం! ఏమైంది ఈ అనుభూతి యిన్నాళ్ళూ ?

"ఏమండీ, పదిగంటలు దాటుతోంది, బ్యాంక్‌కి వెళ్ళరా ఏమిటి? ఆ "లోన్" సంగతి యివ్వాళ తేల్చుకుంటే తప్ప రేపు వాళ్ళకి సొమ్మివ్వడం ఎలా కుదురుతుందీ? ఎందుకలా నోమరిగా, మగతగా కళ్ళు మూసుకున్నారు? రిటైరై మూడు నెలలు కాలేదు, మీలో యింత పరాకు వచ్చేసిందేమిటి? ఆరోగ్యం బాగులేక పోతే డాక్టరుని సంప్రదించరాదా?"

పడక కుర్చీనుంచి లేచాడు. గదిలోకి వెళ్ళి దుస్తులు వేసుకుంటుంటే తానెంత ముసలివాడై పోయాడో తెలిసింది. పొద్దుటినుంచీ గుర్తురాని ముసలితనం యిప్పుడు గుర్తు వచ్చింది.

అందమైన ఎండా, చెట్టుపచ్చదనం, రేగుపండు రుచీ చిట్టితల్లి ఆప్యాయతా, అన్నీ ఉన్నాయి. అదంతా గతం కాదు, యిప్పుడు యిక్కడే ఉంది. ఆ లోకం ఈ లోకంతో కలిసే ఉంది. జీవిత రహస్యం బోధ పడింది. తనకు ముసలితనం లేదు!

# మేఘసందేశం-2

శ్రీ ఎస్. సంజీవ్

ఏ ఎలమావిలో
నీ లేమోవి
కన్పించునోనని
కలకోకిలనై నేను
సంచరిస్తున్నాను!

ఏ పూతోటలో
నీ తీపి మాటలు
విన్పించునోనని
ఎలదేటినై నేను
ఎదురు చూస్తున్నాను!

ఏ కడలి అలలలో
నీ విరుల కురులు
దాగెనేమోనని
కడలి తీరాన్నైన నేను
వీక్షిస్తున్నాను!

ఏ స్వాతి చినుకులో
నీ అందం
నీటి బిందువాయెనోనని
ముత్సపు చిప్పనై నేను
నిరీక్షిస్తున్నాను.

ఏ నీలిగగనాన
ఏ గాలి అలవోలె
అలరిస్తున్నావోనని....
నా కౌగిలి లోగిలికి రమ్మని
అంపుతున్నాను ప్రేమసంకేతాల్ని...
ఈ మేఘసందేశాన్ని!